



వెన్నెల గడ్డ కట్టింది




సూరిబాబుకి, నాగమణికి పెళ్లయి ఏణ్నార్థం అయింది. ఆనాటి నుంచి నాగమణి "ఫలానాది కావాలి" అని అడిగింది లేదు... పంతాలకు పోయి అలిగిందీ లేదు. ఆవిడ అడక్క ముందే అరచేతిలో పెట్టేవాడు సూరిబాబు. గుజ్జనగూళ్లు లాంటి సంసారం.... ఒద్దికైన కాపురం. ఏడాది మీద ఆర్నెల్లు ఇట్టే గడిచిపోయాయి. అదిగో ఆరోజు మాత్రం నోరు విప్పి అడిగింది నాగమణి. "అరే... ఎలా?" అంటూ తలగోక్కున్నాడు సూరిబాబు. ఆవిడ కోరిక తీర్చే మార్గం కోసం "ఎలా... ఎలా?" అని ఆలోచిస్తూ, ఆరా తీస్తూ దిక్కుతోచక, దారి కానక తలపట్టుకొన్నాడు సూరిబాబు.

అలా తలపట్టుకొనే ఆర్రోజులు నైట్ డ్యూటీలు చేశాడు అసిస్టెంట్ స్టేషన్ మాస్టర్ సూరిబాబు. అతను పనిచేస్తున్న స్టేషన్ పట్నం కాదు. కనీసం పాతిక గడపలున్న పల్లెకూడా దగ్గర్లో లేదు. అది సింగిల్ లైన్ సెక్షన్‌లోని ఓ జంగిల్ స్టేషన్. కాకపోతే కరెంటుకి, నీటికీ ఇబ్బంది లేదు. దగ్గర్లో నది, దూరంగా జలవిద్యుత్ కేంద్రం వున్నాయి.



"సో.. మీకెలాంటి ప్రాబ్లమ్స్ వుండవు. పైగా కొత్తగా పెళ్లయిందంటున్నారు. హ్యాపీగా వెళ్లి ఆ స్టేషన్లో జాయినైపోండి. వెళ్లీ వెళ్లగానే క్వార్టర్స్‌లో కాపురం పెట్టే యండి. హనీ మూన్‌కి వెళ్లినట్లుంది" ఏణ్నార్థం క్రితం సూరిబాబు చేతిలో పోస్టింగ్స్ ఆర్డర్స్ పెడుతూ డివిజన్ ఆఫీసులోని పర్సనల్ బ్రాంచి క్యాడర్ క్లర్క్ అన్నాడు.

అప్పుడే ఫ్రెష్‌గా రిక్రూట్ అయిన సూరిబాబుకి అంతా గందరగోళంగా వుంది. ఏ స్టేషన్ ఎలాంటిదో, ఎక్కడ సులువుగా నెట్టుకు రావచ్చో ఐడియా లేదు. ఏఎస్ఎమ్ ట్రైనింగ్ అవుతున్న రోజుల్లో మిగిలిన డివిజన్ల వాళ్లు తన డివిజన్ గురించి జోకు లేసుకునేవాళ్లు. "అడవుల్లో బతకాలి బాబూ... కందమూలాలూ, కసరు కాయలు తినాలి...." అనేవాళ్లు. రైల్వేలో అడుగుపెడుతూనే ఆనుపానులు తెలుసుకున్నవారు, తెలివితేటలతో పాటు ఇన్‌ఫ్లూయన్స్ కూడా వున్నవాళ్లు. అందుకే మంచి మంచి డివిజన్లు కొట్టేసి సూరిబాబుని అడవి డివిజన్‌లోకి పంపించేశారు.

సూరిబాబు రైల్లో ప్రయాణాలు చేశాడు తప్ప, రైల్వే బతుకుల గురించి బొత్తిగా తెలీదు. డిగ్రీ పాసయ్యాక రెండేళ్లు ఖాళీ. ఆ రోజుల్లోనే రైల్వే సర్వీస్ కమీషన్ ప్రకటన. సూరిబాబు పరీక్ష రాశాడు. ఇంటర్వ్యూకి వెళ్లాడు. సెలక్షనూ, ట్రైనింగూ, ఏడాది తిరగ్గానే పోస్టింగు. పోస్టింగ్ ఆర్డర్ అందుకుంటున్నప్పుడు క్లర్క్‌తో తన గోడు వెళ్లబోసుకున్నాడు.

"సరిహద్దుల్లో సైనికులు పనిచెయ్యడం లేదా? గో ఎహెడ్. జాయినైపోండి. పిల్లా పీచు లేరు కదా ఎంజాయ్ చెయ్యండి" అంటూ క్యాడర్ క్లర్క్ ధైర్యం చెప్పాడు.

సూరిబాబు ఆ అడవి స్టేషన్‌లో జాయినైపోయాడు. "అడవైతే ఏంటి? మీతో పాటే నేనూ" అంటూ నాగమణి రైల్వేక్వార్టర్స్‌ని నీటుగా సర్దింది. పల్లెటూరి అమ్మాయి కాబట్టి ఆ వాతావరణంలో హాయిగా సర్దుకుపోయింది. సూరిబాబుకి మరో వ్యాపకం లేదు. స్టేషన్‌లో డ్యూటీ చెయ్యడం. ఇంట్లో నాగమణితో కబుర్లు చెప్పుకోవడం. కలిసి వంట చేసుకునేవారు. అష్టాచెమ్మా, పచ్చీస్ పోలీస్ ఆడుకునేవారు. స్టేషన్ వెనుక చిట్టడవిలో సీతారాముల్లాగా తిరుగుతూ, నది ఒడ్డున ఇసుకతో గూళ్లు కట్టేవారు. క్వార్టర్స్‌లో వెనకాల నిమ్మ, దానిమ్మ, పనస, జామ, సీతాఫలం చెట్లు పిచ్చగా కాస్తాయి.

చెయ్యెత్తితే చాలు గుత్తులు, గుత్తులు. సూరిబాబుకి పనస కూరంటే ఇష్టం. పెరట్లో అందువిడిగా వున్న లేత పనసకాయల్ని సూరిబాబు కోసి తెస్తే, మసాలా కూర వండేది నాగమణి. 'అమృతం' అంటూ చపాతీల్లో ఆ కూరని నంచుకుంటూ లొట్టలు వేసేవాడు సూరిబాబు. 'వీక్లీ ఆఫ్' దొరికితే ఉదయాన్నే ప్యాసింజరు బండి ఎక్కి, మూడు గంటల దూరంలోని పట్నానికి వెళ్లేవారు. అక్కడ కూరా, నార, పప్పూ, ఉప్పూ లాంటివి కొని, మార్నింగ్ షో, మ్యాట్నీలు చూసుకొని మళ్లీ రాత్రి పదిగంటల ప్యాసింజరులో తిరిగి వచ్చేవారు.

ఈ సరదాలు, సంతోషాలూ నాగమణి అడిగితే సూరిబాబు తీర్చినవి కావు. అసలు ఏనాడూ ఆవిడ నోరు విప్పి అడగనూ లేదు. అలాంటి నాగమణి ఆరోజు మాత్రం ''ఏమండీ...''అంటూ మనసారా అడిగింది. సూరిబాబు కరిగిపోయాడు. ఆవిడ చెంప మీద ముద్దాడుతూనే మరో చెంప ఆలోచించాడు. దానికి కోరిక తీరే మార్గం కోసం అన్వేషించాడు. అక్కడా ఇక్కడా వెదికాడు. తెలిసిన వాళ్లని వాకబు చేశాడు. ఊహూ... ఫలితం లేకపోయింది. నాగమణి కోరిక తీరలేదు. ''కాదు.... కాదు..... నేను తీర్చలేదు.'' సూరిబాబుకి దిగులు పట్టుకొంది. నాగమణి చీరలడిగిందా? నగలడిగిందా? ఆఫ్టాల్ ఏ స్మాల్ విష్. చిన్న కోరిక! సూరిబాబు వుంటే వేరేదీ అక్కర్లేదనుకునే నాగమణి ఆ ఒక్కటీ అడిగింది.

''నన్ను క్షమించు నాగమణీ'' ఆరోజుల పాటు వరసగా నైట్ డ్యూటీ చేసి, ఏడో రోజు రెస్ట్ తీసుకోకుండా, పట్నం వెళ్లి, వట్టి చేతుల్తో తిరిగొచ్చిన సూరిబాబు నాగమణిని తన చేతుల్లోకి తీసుకొని కంటతడి పెట్టుకున్నాడు.

నాగమణి కంగారు పడింది. పెనిమిటికి ఏం చెప్పాలో, ఎలా ఓదార్చాలో ఆవిడకి అర్థం కాలేదు. అంతలో వీధి తలుపు చప్పుడైంది. సూరిబాబు తలుపు తీశాడు. ఎదురుగా క్యాబిన్‌మెన్ నరసింహులు. అతని వెనక లావుగా, పొడుగ్గా, గుబురు గడ్డంతో ఓ సర్దార్జీ.

''ఏమిటి నరసింహులూ? ఎవరీయన?'' అడిగాడు సూరిబాబు.

నరసింహులు ఎదురుగా పట్టాలవైపు చూపించాడు.

అక్కడ సెకండ్ లూప్ లైన్ మీద గూడ్సు వ్యాగన్లు వున్నాయి. ముందు రోజు రాత్రి సూరిబాబు డ్యూటీలో వున్నప్పుడే ఆ గూడ్సు బండి వచ్చింది. ఆ స్టేషన్ 'అప్'లో వుండడం వల్ల అతి కష్టం మీద లాక్కొచ్చిన ఇంజన్ అక్కడికి రాగానే ఆయాసపడింది. ఇక నా వల్ల కాదంటూ మొండికేసి, మొరాయించింది. కంట్రోల్ మెసేజ్ ప్రకారం ఇంజన్‌ని డిటాచ్ చేశారు. నాలుగు స్టేషన్ల అవతలున్న లోకోషెడ్‌కి ఇంజన్‌ని పంపించేశారు. మరో ఇంజన్ వచ్చేంత వరకూ ఆ గూడ్సు బండిని ఆ స్టేషన్ పట్టాల మీద తాత్కాలికంగా 'స్టేబుల్' చేశారు.

ఆ గూడ్సు వ్యాగన్లలో పశువుల్ని ప్రత్యేకంగా రవాణా చేసేందుకు వీలుగా 'క్యాటిల్ వ్యాగన్లు' నాలుగైదున్నాయి. వాటిల్లో జెర్సీ ఆవులు పంజాబు నుంచి తమిళనాడుకి ప్రయాణం చేస్తున్నాయి. వాటిలో చూలుతో వున్న ఓ ఆవు ఆ సాయంత్రమే దూడ వేసింది. ఆవులకి ఎస్కార్ట్‌గా గార్డ్ పెట్టెలో ప్రయాణిస్తున్న ఓ సర్దార్జీ ఆవు పాలు పితికి స్టేషన్‌లోని సిబ్బందికి ఉచితంగా పంచి పెడుతున్నాడు. అది చూసిన నరసింహులు సర్దార్జీతో మాట్లాడాడు. సూరిబాబు క్వార్టర్స్‌కి తీసుకొచ్చాడు.

''మాస్టర్ సాబ్ హమారా తరఫ్ సే లీజీయే'' అంటూ సర్దార్జీ ఓ స్టీల్ క్యాన్‌లో ముర్రుపాలు అందించాడు.

సూరిబాబు ఆనందం పట్టలేకపోయాడు. సర్దార్జీకి కృతజ్ఞతలు చెప్పి, చీకట్లో కళ్లు తుడుచుకుంటూ డబ్బులివ్వబోయాడు.

''నమస్కార్ సాహెబ్'' అంటూ సున్నితంగా తిరస్కరించిన సర్దార్జీ హుందాగా అడుగులు వేసుకుంటూ వ్యాగన్ల వైపు వెళ్లిపోయాడు.

ఆ రాత్రి... అప్పటికప్పుడు.. సూరిబాబు, నాగమణి జెర్సీ ఆవు ముర్రుపాలతో జున్ను వండుకొన్నారు. ఆవిరిలో జున్ను ఉడుకుతుంటే యాలకుల వాసనతో ఆ రైల్వే క్వార్టర్స్ గుమ్మెక్కిపోయింది.

నెల తప్పిన నాగమణి-''జున్ను తినాలని వుందండీ'' అంటూ వారం రోజుల క్రితం అడిగిన చిన్న కోరిక....

''అయ్యో తీర్చలేకపోయానే'' అంటూ సూరిబాబు కంటతడికి కారణమైన ఓ తీయని కోరిక....

గడ్డకట్టిన వెన్నెల్లాంటి కమ్మటి జున్నుతో తీరిపోయింది. అవతల గూడ్సుబండిలోని క్యాటిల్ వ్యాగన్‌లో కొత్తగా భూమ్మీద పడ్డ లేగదూడ గోమాత పొదుగులో తల దూర్చింది.

*

## జెనీలియా ప్రేమ



తెలుగు సినిమా 'నువ్వే కావాలి'కి హిందీ రిమేక్ 'ముఝే తేరీ కసమ్'లో జెనీలియా, రితేష్ దేశ్ ముఖ్ కలిసి నటించారు. అప్పటి నుండి వీళ్ళిద్దరి మధ్యా ఏదో ఉందన్న ఊహాగానాలు ప్రారంభ మయ్యాయి. మహారాష్ట్ర ముఖ్యమంత్రి విలాస్‌రావ్ దేశ్‌ముఖ్ కుమారుడైన రితేష్ దేశ్‌ముఖ్ ఈ ఊహల్ని అంగీకరించలేదు, తిరస్కరించనూ లేదు. జెనీలియా మాత్రం మాది కేవలం స్నేహ మంటూ తీసి పారేసింది. ఇద్దరూ తరచూ రహస్యంగా కలుసుకోవడం, పార్టీల్లో పాల్గోవడం లాంటివి మాత్రం ఏదో ఉందన్న విషయాన్ని ధృవీకరించాయి. ఆ మధ్య ఇద్దరూ పెళ్ళి చేసుకోబోతున్నట్టు కూడా వార్తలు వచ్చాయి. అయితే ఇప్పుడు రితేష్ వేరే అమ్మాయిని పెళ్ళిచేసుకుంటున్నాడని తెలిసింది. జెనీలియా క్రిస్టియన్ కావడం రితేష్ తల్లిదండ్రులకు ఇష్టం లేదని, అందుకే వీరి వివాహాన్ని తిరస్కరించారని తెలిసింది. జెనీలియా మాత్రం ఈ విషయంపై పెదవి విప్పడం లేదు. ఇటీవల ప్రేమ విషయాన్ని అడిగిన విలేకరితో, ''అవును, నేను ప్రేమిస్తున్నాను. నేను ప్రస్తుతం నా కెరీర్‌ను, పెంపుడు కుక్కల్ని మాత్రమే ప్రేమిస్తున్నాను'' అంటూ తెలివైన సమాధానాన్నిచ్చింది.